



# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 107 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 14 మే 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## కస్టోడియల్ టార్చర్ కేసు.. జగన్‌ను వదిలే ప్రసక్తి లేదు

- డిప్యూటీ స్పీకర్ రఘురామ



**భీమవరం,మన జనప్రగతి మే 13:**వైసీపీ హయాంలో తనపై నమోదైన కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఈ కేసుపై తాను పట్టువదలని విక్రమార్కుడిలా న్యాయం కోసం ప్రయత్నిస్తున్నానని వ్యాఖ్యానించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మిగతా2లో...

## క్రూడాయిల్ సంక్షోభం కొనసాగితే దేశంలో చమురు ధరల పెంపు తప్పదు: ఆర్బీఐ గవర్నర్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మే 13:**దేశంలో పెట్రో ధరల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. మిడిల్ ఈస్ట్ వార్, క్రూడాయిల్ ధరల పెరుగుదల కారణంగా దేశంలో పెట్రో ధరలు క్రమంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని, ద్రవ్యోల్బణం, చమురు మిగతా2లో...

## హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

- ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పోరేట్ ఆఫీస్
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి



**హైదరాబాద్,మన జనప్రగతి మే 13:** హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సీటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మిగతా2లో...

## అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

● అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక ● టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ ● తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధి ● కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు ● కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు






**అమరావతి,మన జనప్రగతి మే 13:** అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ మిగతా2లో...

## 15న ఆధారాలతో విచారణకు వస్తా...

- పోలీసులకు బండి భగీరథ్ లేఖ


2లో

## నీట్ పేర్ లీక్‌లో సిబిఐ దూకుడు

- దేశంలో ఏకకాలంలో సోదాలు
- ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన


2లో

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు

ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్

ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని




**పుదుచ్చేరి,మన జనప్రగతి మే 13:** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా మిగతా2లో...


## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు

విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె

అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు

ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్



**చెన్నై,మన జనప్రగతి మే 13:** తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, మిగతా2లో...

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్,మన జనప్రగతి మే 13:** తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు మిగతా2లో...

## పొదుపు సూత్రాలు తెలంగాణకు... నిధులు మాత్రం ఆంధ్రాకా ..?


- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్,మన జనప్రగతి మే 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి మిగతా2లో...

## పొదుపు బాటలో సిఎం చంద్రబాబు

- కాన్వాయ్‌లో 50శాతం వాహనాల తగ్గింపు
- డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో సమావేశంలో ఆదేశాలు



**అమరావతి,మన జనప్రగతి మే 13:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పర్యటనల సమయంలో తన కాన్వాయ్‌లో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ ఇటీవల సూచించిన నేపథ్యంలో మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
14 -05-2026

# అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందని చంద్రబాబు అన్నారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళు న్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మే 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకు రావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశ వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తు న్నారు. సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందిన వారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండ గానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేష న్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. ఢిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

# పొదుపు బాటలో సిఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో ఈ ఆదేశాలు ఇచ్చారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనల్లో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుంటూనే అనవసర వాహనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌కే పరిమితం కాకుండా మంత్రులు, ఇతర వీఐపీలు కూడా సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అన్ని స్థాయిల్లో 50 శాతం వాహనాల తగ్గింపు అమలు అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవస్థలో పొదుపు సంస్కృతి పెంపొందించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఇంధన వినియోగం తగ్గించడం ద్వారా ఆర్థిక భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అవుతుందని సీఎం తెలిపారు. కాన్వాయ్ వాహ నాల తగ్గింపుతో పాటు ప్రభుత్వ ఖర్చుల నియంత్రణ, ఇంధన పొదుపు, పరిపాలనా వ్యయాల తగ్గింపు వంటి అంశాలపై ఇప్పటికే అధికార స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. ఈ అంశాల పై రేపు(గురువారం) జరిగే కేబినెట్ సమావేశంలో విస్తృత చర్చ జరగనుండగా, మరిన్ని కీలక విధాన నిర్ణయాలను సీఎం చంద్రబా బు ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వ పరిపాలనలో సరళీక రణ, ఖర్చుల నియంత్రణ, వనరుల సమర్థ వినియోగం దిశగా సీఎం చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారింది. ప్రభుత్వ యంత్రాంగం నుంచి ప్రజలకు కూడా పొదుపు సందేశం వెళ్లేలా ఈ చర్యలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

(మొదటి పేజీ తరువాయి)

వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాస పరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారిగా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వ డం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసా గించాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# కస్టోడియల్ టార్చర్ కేసు.. జగన్‌ను వదిలే ప్రసక్తి లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం తన పుట్టినరోజు అని.. తన కేసు రేపటికి ఐదేళ్లు అవుతుందని తెలిపారు. తన కేసులో మూడో ముద్దాయిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ప్రస్తావించారు. మొదటి ముద్దాయి విచారణకు రాయల్‌గా వచ్చి రాయల్‌గా వెళ్లిపోయారని రఘురామ విమర్శించారు. రెండో ముద్దాయిని, మూడో ముద్దాయిని ఇంకా విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ కేసులో జగన్ రెడ్డి, సునీల్ కుమార్ పేర్లు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని తెలిపారు. 2027 జూన్‌లో పోలవరం పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని అన్నారు. పోలవరంతో పాటు తన కస్టోడియల్ టార్చర్ కేసును కూడా పూర్తి చేస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు. తనపై మహాసేన రాజేశ్ పెట్టిన పోస్టును చూశానని తెలిపారు. జగన్ రెడ్డిని ఇప్పటివరకు తాను ఎందుకు ప్రశ్నించలేదని రాజేశ్ అడిగారని చెప్పారు. ఈ విషయంపై ఆయనతో మాట్లాడతానని అన్నారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఆయన చేసిన దారుణాల గురించి తాను మాట్లాడానని చెప్పుకొచ్చారు. రచ్చబండ ద్వారా జగన్ రెడ్డిని ఓడించే వరకు మాట్లాడానని తెలిపారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారని విమర్శించారు. ఇంకా జగన్ గురించి తాను మాట్లాడేది ఏముందని రఘురామ ప్రశ్నించారు.

# క్రూడాయిల్ సంక్షోభం కొనసాగితే దేశంలో చమురు ధరల పెంపు తప్పదు: ఆర్బీఐ గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతులపై ప్రభావం తప్పదని అభిప్రాయపడ్డారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన స్విస్ నేషనల్ బ్యాంక్ అండ్ ద ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్ సదస్సులో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల ప్రభావం నుంచి ప్రభుత్వం ప్రజల్ని నిరంతరం రక్షించలేదన్నారు. నిరంతరం ధరల పెరుగుదల కొనసాగితే, ప్రభుత్వం దేశంలో పెట్రో ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకునేందుకు ఎంతో సమయం పట్టదన్నారు. ఇప్పటికే చమురు ధరల్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాల్ని తగ్గించిందని గుర్తు చేశారు. ఆయిల్ కంపెనీల నష్టాలను ప్రభుత్వం భరిస్తూ వస్తోందని, ధరల్ని అదుపులో ఉంచుతోందని వెల్లడించారు. అయితే, ప్రభుత్వం ఎంతకాలం ఈ పని చేయగలదనేది సందేహమన్నారు. దేశానికి చమురు అందించే హార్ముజ్ జలసంధిని ఇరాన్, అమెరికా మూసేసిన నేపథ్యంలో చమురు రవాణా జరగకుండా, సంక్షోభం తలెత్తింది. మరోవైపు దేశంలో చమురును పొదుపుగా వాడాలని ప్రధాని మోదీ ఇటీవల ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశం లోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచిం చారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# 15న ఆధారాలతో విచారణకు వస్తా...

**హైదరాబాద్,మన జనప్రగతి మే 13:** పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 15న జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# పొదుపు సూత్రాలు తెలంగాణకు... నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# చీని తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు




**లింగాల మన జనప్రగతి మే 13:-** మండల పరిధిలోని కామసముద్రం, అంకెవానిపల్లి, బోనాల గ్రామాలలోని చీని తోటలను కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు స్థానిక ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలోని చీని తోటల్లో గత కొన్ని సంవత్సరాలుగా పొలుసు పురుగు అధికంగా వ్యాప్తి చెంది చీని తోటలను నష్టపరచడం జరిగినది. ఈ సంవత్సరం మండల పరిధిలోని పలు చీని తోటల్లో ఈ పొలుసు పురుగు యొక్క ఉధృతిని సర్వే చేయడానికి విజయవాడ శాస్త్రవేత్తలు పలు గ్రామాల్లో చీనితోటలను పరిశీలించారు. ఈ పొలుసు పురుగులు మొక్క యొక్క కాండం మీద తెల్లగా ఉండి రసం పీల్చటం వలన త్వరగా బేరడు చీలి, చెట్లు వాడు పట్టడం తో పాటు కాండం మీద "పైటాఫ్థెర" అనే బంక శిలీంద్రనాసిని ఏర్పడుతుంది. దీని వలన చెట్టు వేరు వ్యవస్థ మరియు ఎదుగుదల మందగించటంతో చెట్లు మరణించడం జరుగుతుంది అని వివరించారు. చీని చెట్లు దెబ్బ తినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్ల మించి నీరు ఇవ్వకూడదని, వీటి నివారణకు గొనె సంచితో కాండం లేద చెట్ల బేరడు పై బాగా రుద్దాలి ఆ తర్వాత "భూప్రొఫెజైన్" లీటర్ నీటికి 2.5 మిల్లి లీటర్లు మరియు "బేనోల్ ఆయిల్" ఒక లీటర్ నీటికి 10 మిల్లి లీటర్ల చొప్పున కలుపుకొని పిచికారీ చేసుకున్నట్లయితె పోలుసు పురుగును నివారించవచ్చని తెలియజేశారు. ట్రైకోడెర్మా మరియు సూడోమోనస్ ద్రావణాన్ని సంవత్సరానికి రెండు సార్లు భూమిలో తేమ ఉన్నప్పుడు పోసినట్లైతే వేరు కుళ్ళు రోగాన్ని నివారించుకోవచ్చని కేంద్ర బృంద ప్రతినిధులు వివరించారు. ఈకార్యక్రమంలో ఉద్యన శాఖ అధికారి జి. రాఘవేంద్ర రెడ్డి, ఆయా గ్రామాల రైతుసేవా కేంద్ర సిబ్బది విజయవాడ నుండి ఎం.పి గోస్వామి, జాయింట్ డైరెక్టర్ ఎంటమాలజీ, కె.వి చౌదరి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంటమాలజీ, పి.మను ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంయుక్త సర్వే నిర్వహించి చీని తోటలు పరిశీలించడం జరిగినది.

# టక్కోలి పంచాయతీ కాజీపల్లి ఎస్టీ కాలనీలో తీరిన తాగునీటి సమస్య




**సిద్దవటం మన జనప్రగతి మే 13:-** కూటమి ప్రభుత్వ పరిపాలనలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సిద్ధవటం మండలం టక్కోలి గ్రామ పంచాయతీ పరిధిలోని కాజీపల్లి ఎస్టీ కాలనీలో సుదీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పరిపాలన, నారా లోకేష్ గారి నాయకత్వం, రాజంపేట ఇంచార్జి జగన్ మోహన్ రాజు గారి ఆధ్వర్యంలో ఈ కాలనీకి కొత్త మోటార్, పంపు, స్టార్టర్, వైర్ కనెక్షన్, మరియు పైప్‌లైన్ కనెక్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, ధర్మసేన రెడ్డి, శంకర్ మరియు ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా నాయకులు నాగముని రెడ్డి గారు స్పష్టం చేశారు.

# పత్తికొండలో "బడికి వెళ్దాం" కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**పత్తికొండ మన జనప్రగతి మే 13:-** పత్తికొండ పట్టణంలో ఈరోజు "బడికి వెళ్దాం" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీ.ఈ.ఓ) సుధాకర్ సార్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఆయనను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రామ్మోహన్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ జరిగిన ఈ ర్యాలీ పట్టణంలో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రమేష్ సార్, మాలతి మేడం పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే టీచర్లు సుధాకర్, సత్యనారాయణ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# జూటూరులో శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవం ఘనంగా



**పత్తికొండ మన జనప్రగతి మే 13:-** పత్తికొండ మండలం జూటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కోఆర్డినేటర్ కంగాటి శ్రీదేవమ్మ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆంజనేయస్వామి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అలాగే సమయానికి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు పుష్కలంగా పండాలని, గ్రామాల్లో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్నూలు సర్వజన ఆసుపత్రి ద్వారా ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలి: రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ గుప్త.





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 13:-** కర్నూలు సర్వజన ఆసుపత్రి కి కావలసిన అన్ని సౌకర్యాలను సమకూర్చు తున్నామని, ప్రజలకు సంతృప్తికరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలనిరాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో మంత్రి భరత్ గుప్త ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్ మరియు సర్వజన ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు విషయాలపై సమీక్షించి సూచనలు జారీ చేశారు. ఈ మధ్య మార్చురీలో డబ్బులు తీసుకుంటున్నారు అన్న విషయం మీడియా ద్వారా తెలిసిందని అన్నారు. ఈ విషయం పై విచారించగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులు మార్చురీలో గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వము నుండి ఎటువంటి జీత భత్యాలు లేకుండా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారని తెలుసుకున్నారు. వెంటనే వారిని ఔట్సోర్సింగ్ లో పారిశుద్ధ కార్మికులుగా తీసుకొని వారికి జీత భత్యాలు చెల్లించి వారు ప్రజల నుండి సొమ్ము వసూలు చేయకుండా చూడాలని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో దాదాపు 400 ఏసీలు ఉండగా అందులో 300 చాలా పాతవి తరచూ రిపేర్లు చేయవలసిన అవసరం ఉన్నదని తెలుసుకున్న మంత్రి దశలవారీగా ఆసుపత్రి నిధులతో క్రొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఏఎంసీ ద్వారా ఏసీలు మరమ్మతులు చేయించుకోవాలని అవసరమైన మేరకు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూపరిండెంట్ను ఆదేశించారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన ఏడు ఆక్సిజన్ ప్లాంట్లను వాడుకులోకి తీసుకుని రావడానికి అవసరమైన ప్రణాళికలు సమర్పించవలసిందిగా ఆదేశించారు. సర్వజన ఆసుపత్రి ఎల్లప్పుడూ పరిశుభ్రముగా ఉండే విధంగా కాంట్రాక్టర్ అధికారులకు సహకరించాలని, అధికారుల సూచనల మేరకు కాంట్రాక్టర్ సిబ్బందిని నియమించి ప్రజల నుండి ఐ విఆర్ఎస్ ద్వారా మంచి ఫీడ్బ్యాక్ వచ్చే విధంగా చర్యలు ఉండాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. నర్సింగ్ సిబ్బంది యొక్క సేవలను సున్నితమైన ప్రదేశాల్లో ఇబ్బంది కలగకుండా స్వల్ప మార్పులు చేర్పులు చేసుకుని వారి ద్వారా రోగుల కు మంచి సేవలు అందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి ఇంకా అవసరమైన వెంటిలేటర్లు , లైఫ్ సపోర్టింగ్ ఎక్విప్మెంట్ , బెడ్లు, ట్రాలీలు మొదలగునవి సమకూర్చుతామని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న జనరేటర్లు ఆటోమేటిక్ గా పనిచేసే విధంగా సమర్థవంతంగా ఉండాలని , 50 సీసీటీవీ ల ద్వారా అన్ని విషయాల పై నిరంతర పర్యవేక్షణ జరుగుతూ ఉండాలని, అన్ని స్కానర్లు ఏఎంసీ వినియోగించుకొని ఎల్లప్పుడు పనిచేస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించే విషయాలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని అధికారులను కోరారు. ప్రజలకు సంతృప్తికరమైన మంచి వైద్య సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని మంత్రి భరత్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ , జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ నాగేశ్వరరావు ,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి , అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం , హాస్పిటల్ డెవోలోప్ కమిటీ మెంబర్ లు డాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్ , స్టేట్ క్యాన్సర్ యూనిట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ , ఏపీఎంఐడిసి ఈఈ చిరంజీవులు, డిఎంహెచ్వో కామేశ్వర ప్రసాద్ , డెప్యూటీ భాస్కర్ , జిల్లా సర్వైవలెన్స్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి , ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ భాస్కర్ రెడ్డి , డి ఐ ఓ డాక్టర్ ఉమా,డాక్టర్ లు శివబాల, కిరణ్ మొదలగు వారు పాల్గొన్నారు.

# దేవనకొండ నూతన ఎం.ఆర్.ఓగా వైకే రామేశ్వర్ రెడ్డి పదవి బాధ్యతలు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎం.ఆర్.ఓ వైకే రామేశ్వర్ రెడ్డి

**దేవనకొండమన జన ప్రగతి మే 13:-** దేవనకొండ మండల నూతన ఎం.ఆర్.ఓ గా వైకే రామేశ్వర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. దేవనకొండ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది నూతన ఎమ్మార్వోకు స్వాగతం పలికారు. అధికారులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎం.ఆర్.ఓ వైకే రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండల ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలనుత్వరితగతినపరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూమి వివాదాలు, ఆదాయ ధృవపత్రాలు, పాస్‌బుక్స్, ఇతర సేవలకు సంబంధించిన సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలుకార్యాలయానికి వచ్చినప్పుడు ఇబ్బందులు పడకుండా సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలతోస్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. కార్యాలయంలో క్రమశిక్షణతో పాటు పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. మండల అభివృద్ధికి ప్రతి శాఖతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని చెప్పారు. అనవసర ఆలస్యాలకు తావు లేకుండా పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని ఎమ్మార్వో పేర్కొన్నారు. ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



# జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## 57 సెంటర్లలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే13:-** మే 21 వ తేది నుండి జూన్ 4వ తేది వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను 57 సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 21 వ తేది నుండి జూన్ 4 వ తేది వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను 57 సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి సంవత్సరం నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 15,835 మంది జనరల్ విద్యార్థులు, 1815 మంది ఒకేషనల్ కోర్సు కు సంబంధించిన విద్యార్థులు మొత్తం 17,650 మంది విద్యార్థులు వ్రాస్తున్నారని, 2 వ సంవత్సరానికి సంబంధించి 7,374 మంది జనరల్ విద్యార్థులు, 775 మంది ఒకేషనల్ కోర్సు కు సంబంధించిన విద్యార్థులు మొత్తం రెండో సంవత్సరానికి 8,149 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారన్నారు, ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రశ్న పత్రాలను ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లో భద్రపరచడం జరుగుతుందని, ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాల వద్దకు ఎస్కార్ట్ తో తీసుకొని వెళ్లాలని, ఉదయం పరీక్షల నిర్వహణ అనంతరం ఎస్కార్ట్ తో పోస్ట్ ఆఫీస్ వద్దకు తీసుకొని వెళ్లి పోస్టల్ ద్వారా పంపించవలసి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ వారు పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం కల్పించాలని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలని, పరీక్ష కేంద్రాల నిర్వహణలో ఫ్లేయింగ్ స్క్వాడ్ లో ఇద్దరు రెవిన్యూ అధికారులు ఉండేలా చూడాలని కలెక్టర్ రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా సరిపడే బస్సులు సంబంధిత రూట్ లలో తిరిగేలా చూడాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని అదే విధంగా వైద్య సిబ్బంది కూడ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్ లను మూయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, ఆర్ఐఓ లాలప్ప, కర్నూలు నగరపాలక సంస్థ అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎస్పీడీసీఎల్ డిఈ విజయ భాస్కర్, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
14 -05-2026

## గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**చక్రాయపేట మన జనప్రగతి మే 13:-** బుధవారం చక్రాయిపేట మండలం గండి శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు అత్యంత వైభవంగా పూర్తయిన నేపథ్యంలో ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అనంతరం స్వామివారి దర్శనం, ప్రత్యేక అర్చనలు, ఆలయ సత్కారం చేసి జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు ఆలయ ప్రధానార్చకులుముందుగా ఆలయ ప్రాంగణంలో.. జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక ఆశీర్వదాలు అందించి, గౌరవ పూర్వకంగా దేశవస్థాన కండువా, పూలమాల వేసి ప్రధాన ఆలయంలో ప్రత్యేక అర్చనలు చేయించిన పుష్పగిరి పీఠాధిపతి విద్య శంకర్ భారతి స్వామీజీఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం.. దేవస్థాన చరిత్ర, ప్రాశస్త్యాన్ని జిల్లా కలెక్టర్ కు వివరించిన ఆలయ ప్రధాన అర్చకులు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట హాజరైన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శంకర్ బాలాజీ, డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, ఆలయ చైర్మన్ కల్లూరి వెంకట స్వామి, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు

## సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ బిల్డింగుల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**పెండ్లిమర్రి మన జనప్రగతి మే 13:-** బుధవారం మధ్యాహ్నం కమలాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా పెండ్లిమర్రి మండల పరిధిలోని వెల్లటూరు జెడ్పి హైస్కూల్ ప్రాంగణాల్లో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ బిల్డింగుల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరికిచెన్ షెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులకు సెంట్రలైజ్డ్ మోడల్ కిచెన్ షెడ్ నిర్మాణ పనులపై పలు సూచనలు, సలహాలు, అదేశాలిచ్చిన అనంతరం.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్మార్ట్ కిచెన్ షెడ్లను నిర్వహణలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్.వంట నిర్వాహకులతో మాట్లాడుతూ.. కుక్కింగ్ లో నైపుణ్యతను పెంచుకోవాలని, పిల్లలకు నాణ్యమైన, శుచికరమైన, రుచికరమైన భోజనాన్ని అందించేందుకు బాధ్యతతో పని చేయాలని, మన ఇంట్లో ఎలా శుచిగా శుభ్రంగా వంట వండుకుంటామో అదే భావనతో విద్యార్థిలకు పోషకాహారాన్ని అందించాలని సూచించిన జిల్లా కలెక్టర్.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట డ్వామా, డిఆర్డీఏ పిడీలు అదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు

## ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి: కమిటీ సభ్యులకు గౌతమ్ కుమార్ పిలుపు



**ఉరవకొండ మన జనప్రగతి మే, 13:-** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నూతన అభివృద్ధి కమిటీ సభ్యులను ఇంచార్జి గౌతమ్ కుమార్ ఘనంగా సన్మానించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు తిమ్మప్ప, సుదర్శన, మరియు సరస్వతిలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యుల నాయకత్వంలో, సమాజం పట్ల వారికున్న అంకితభావంతో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు.సమాజ అభివృద్ధిని కాంక్షిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణ కోసం కమిటీ సభ్యుల పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

**మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**

**ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్**




**రాయచోటి మన జనప్రగతి మే 13 :-** అందరి సహకారంతో అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ పేర్కొన్నారు.బుధవారం రాయచోటి ఏరియా ఆసుపత్రిలోని ఐసీటీసీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, వివిధ విభాగాల నెలవారీ నివేదికలను పరిశీలించారు. నివేదికల్లో ఉన్న వ్యత్యాసాలను సరిదిద్దుకొని సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా ఉన్న వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ కేసులను గుర్తించి వారికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఏఆర్టీ కేంద్రాలు, ఐసీటీసీలు, ఎన్జీవోలు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఐసీటీసీ కేంద్రాల్లో పరీక్షా కిట్లు, ఏఆర్టీ మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.మొదటి 95, రెండో 95, మూడో 95 లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం మే నెల మూడో ఆదివారం నిర్వహించే కాండిల్ లైట్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమాదేవి, ఎల్‌టీ శంకర్, ఎన్జీవో ప్రతినిధులు స్వాతి, పవన్, అల్లవల్లి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## పాపాగ్ని నదిలో 300 గ్రామాలకు తాగునీరు అందించే పైప్ లైన్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.



**వేంపల్లె/చక్రాయపేట మన జనప్రగతి మే 13:-**బుధవారం పులివెందుల నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. చక్రాయపేట మండల పరిధిలోని గండి సమీపంలో పాపాగ్ని నదిలో 300 గ్రామాలకు తాగునీరు అందించే పైప్ లైన్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.ఆర్డబ్ల్యూ ఎస్ ఆధ్వర్యంలో మెగా ప్రాజెక్టు ఏజెన్సీ నిర్వహణలో జరుగుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో మాట్లాడి.. పనులు వేగవంతం చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిఅనంతరం చక్రాయపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేంపల్లె పట్టణంలోని జెడ్పి హైస్కూల్ ప్రాంగణాల్లో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ బిల్డింగుల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిప్రస్తుతం నిర్వహణలో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వాహణకు సంబంధించి కిచెన్ షెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులకు సెంట్రలైజ్డ్ మోడల్ కిచెన్ షెడ్ నిర్మాణ పనులపై పలు సూచనలు, సలహాలు, అదేశాలిచ్చిన జిల్లా కలెక్టర్.ప్రస్తుతం స్లాబ్ లెవెల్ పూర్తయి, వాల్స్ ప్లాస్టరింగ్ పనుల దశలో వున్న కిచెన్ షెడ్ల నిర్మాణంలో మార్పులు చేర్పులను సూచిస్తూ.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్మార్ట్ కిచెన్ షెడ్లను నిర్వహణలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్.వంట నిర్వహకులతో మాట్లాడుతూ.. కుక్కింగ్ లో నైపుణ్యతను పెంచుకోవాలని, పిల్లలకు నాణ్యమైన, శుచికరమైన, రుచికరమైన భోజనాన్ని అందించేందుకు బాధ్యతతో పని చేయాలని, మన ఇంట్లో ఎలా శుచిగా శుభ్రంగా వంట వండుకుంటామో అదే భావనతో విద్యార్థిలకు పోషకాహారాన్ని అందించాలని సూచించిన జిల్లా కలెక్టర్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఆయా మండలాల పరిధిలో హాజరైన డ్వామా, డిఆర్డీఏ పిడీలు అదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, చక్రాయపేట స్థానిక నాయకులు శివప్రసాద్ రెడ్డి, ఎంపిడివో శివారెడ్డి, తహాశీల్దార్ విజయకుమారి, వేంపల్లె ఎంపిడివో కుల్లాయమ్మ, తహాశీల్దార్ మోహన్ కృష్ణ, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు

## వజ్రకరూరు: 9వ రోజుకు చేరిన సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికుల సమ్మె: సిపిఎం మద్దతు



**వజ్రకరూరు మన జనప్రగతి మే 13:-** వజ్రకరూరు మండలం కొనకొండ్ల సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి తొమ్మిదవ రోజుకు చేరుకుంది. గత ఐదు, ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేస్తున్న ఈ పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, నెలల తరబడి జీతాలు అందక కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమ్మె కారణంగా మండలంలోని 16 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వం స్పందించి, వెంటనే కార్మికుల బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. తద్వారా కార్మికులకు న్యాయం చేయడంతో పాటు, ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.సిఐటియూ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి, సుధాకర్, చాపాల సుధాకర్ పాల్గొన్నారు. అలాగే సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు చిన్న బాబయ్య, జయన్న, పెద్ద చెన్నయ్య, గోవిందు, లాలు స్వామి, సంతోష్, వెంకటాచలం, రఘు తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## వేసవిలో పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

**● 2026-27 లక్ష్యాలను అధిగమించాలి:**

**ఉపసంచాలకులు డా.జి.శ్రీనివాసులు రెడ్డి**




**కడప మన జనప్రగతి మే 13:-** వేసవి కాలంలో పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,అలాగే 2026-27 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డా. జి. శ్రీనివాసులు రెడ్డి సూచించారు.గురువారం ఊటుకూరులోని కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా. శ్రీనివాసులు,ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా.రాజ్ తిమ్మా రెడ్డి,సహాయ సంచాలకులు,పశువైద్యాధికారులు హాజరయ్యారు.సమావేశంలో ఉపసంచాలకులు మాట్లాడుతూ..రాబోయే 90 రోజులకు సంబంధించి ఆర్ఎస్‌కే (ఆర్.ఎస్.కె) వారీగా పశుగ్రాస లభ్యత నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.పశుగ్రాసం కొరత ఉన్న గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పండించే చర్యలు తీసుకోవాలని తెలిపారు.అలాగే వినియోగంలో ఉన్న నీటి తొట్లలో నీటిని నింపి పశువుల దాహాన్ని తీర్చాలని కోరారు.2026-27 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను ఆర్ఎస్‌కే వారీగా విభజించి, వాటిని సాధించేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని,కడప డివిజన్‌ను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు.ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా.రాజ్ తిమ్మా రెడ్డి మాట్లాడుతూ..కృతిమ గర్భధారణలో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని,ఉత్తమ జాతి పశువులకు లింగ నిర్ధారిత వీర్యం వినియోగం ద్వారా ఆడ దూడలు పుట్టేలా రైతులను చైతన్యపరచాలని కోరారు.జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.శ్రీనివాసులు మాట్లాడుతూ..సిబ్బంది సమయపాలన పాటిస్తూ కార్యాలయ విధులు నిర్వహించాలని,రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు.అలాగే పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి ఆరోగ్యాన్ని కాపాడాలని తెలిపారు.

## మాధవరం-1 గ్రామంలో వృథాగా తాగునీరు

**- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**




**సిద్ధవటం మన జనప్రగతి మే 13:-** మండలంలోని మాధవరం-1 గ్రామం రోడ్ నెంబర్ 13లో గత కొన్ని రోజులుగా తాగునీటి పైపు గేట్ వాల్వ్ లీకేజీ వల్ల నీరు వృథాగా పోతోంది. పత్రికల్లో వార్తలు వచ్చినా, పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లీకేజీ నీరు నిల్వ ఉండి ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోందని, దోమలు ప్రభలుతున్నాయని ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. దీనిపై పంచాయతీ సెక్రెటరీ లక్ష్మీ నరసయ్య స్పందిస్తూ, గేట్ వాల్వ్ సమస్య వల్ల లీకేజీ ఏర్పడిందని, రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయించి, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయిస్తామని హామీ ఇచ్చారు.

## వేంపల్లె సెంట్రల్ కిచెన్ షెడ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**వేంపల్లె మన జనప్రగతి మే 13:-** వేంపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ కిచెన్ షెడ్ ను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేరుకూరి తనీఖీ చేశారు. బుధవారం వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో దాదాపు రూ 38 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ కిచెన్ షెడ్ పనులను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేరుకూరి తనీఖీ చేశారు. పనులు త్వరగా చేపట్టాలని కాంట్రాక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి కావాలని కోరారు. అలాగే వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు పనులను కూడ వాహనాలోనే వెళ్తు పరిశీలించారు. ఈయన వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ



**దేవనకొండ మన జనప్రగతి మే 13:-**కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన వివాహ కార్యక్రమాల్లో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మల్లయ్య, తిమ్మప్ప యాదవ్ మరియు టిడిపి నాయకులు పాల్గొని, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేసే మౌనిక ప్రథమ వర్ధంతి నిరాశ్రయులకు పండ్లు పంపిణీ



**పులివెందుల మన జనప్రగతి మే 13:-** నగరిగుట్ట పట్టణ ప్రాథమిక ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ కుమార్తె నేసే మౌనిక ప్రథమ వర్ధంతి సందర్భంగా నగరిగుట్టలోని నిరాశ్రయుల ఆశ్రమం లోని వృద్ధులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, తండ్రి సురేష్, చెల్లెలు నేసే స్వరూప ల చేతులమీదుగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో రాఘవేంద్ర రెడ్డి, చాంద్ బాషా పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
14 -05-2026

## వేంపల్లెలో ఘనంగా ఆవోపా 127వ జయంతి వేడుకలు


**- ఆవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకట సునీల్**



**వేంపల్లె మన జనప్రగతి మే 13:-** వేంపల్లెలో ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కీ.శే.కెఆర్. కృష్ణయ్య చెట్టి 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించామని అవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకటసునీల్ కుమార్ తెలిపారు.బుధవారం వేంపల్లె లోని అమ్మవారిశాల కార్యాలయంలో అవోపా వ్యవస్థాపకులు కీ.శే.కెఆర్. కృష్ణయ్య చెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం కార్యవర్గ సభ్యులు మాట్లాడారు సేవే లక్ష్యంగా అవోపా సంస్థ స్థాపించారని తెలిపారు.ఆర్యవైశ్య పేదల అభ్యున్నతికి అవొపా సంస్థ ను ఏర్పాటు చేశారని తెలిపారు.నేటికి ఆయన ఆశయానికి అనుగుణంగా వేంపల్లెలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఇతర వర్గాల వారికి కూడా వైద్య సేవలను మరయు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

## నేడు మండల కన్వీనర్‌గా కురుబ మల్లెన్న ప్రమాణ స్వీకారం

**- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**బొమ్మనహల్ మన జనప్రగతి మే 13:-**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాలతో బొమ్మనహల్ మండల తెలుగుదేశం పార్టీ నూతన మండల అధ్యక్షుడు (మండల కన్వీనర్)గా కురుబ మల్లెన్న నేడు గోవిందవాడ గ్రామంలో ఉదయం 10:00 గంటలకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరవుతున్నారు. మరియు మండల పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు,యూనిట్ ఇన్‌చార్జీలు, బీఎల్‌వోలు, కార్యకర్తలు,యువ నాయకులు, అభిమానులు,పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూతన మండల కన్వీనర్ కురుబ మల్లెన్న,కోరారు.

## ఈ నెల 15న పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

**- కల్లూరు ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజల నుండి వినతుల స్వీకరణ: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 13:-**ఈ నెల 15 వ తేదీన పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహణ లో భాగంగా కల్లూరు ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఒక ప్రకటన లో తెలిపారు.కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా వచ్చే శుక్రవారం 15 వ తేదీన కల్లూరు ఎంపిడిఓ కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) ను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో 15 వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే, అధికారులు పాల్గొంటారని, కల్లూ రు, ఓర్వకల్లు మండలాలు, కర్నూలు నగర పరిధిలోని 16 వార్డ్ లలో ఉన్న ప్రజలు తమ సమస్యలను తెలుపుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీ చైతన్యకు ఇన్ఫార్మర్‌గా డిప్యూటీ డీఈఓ సీసీ ఏఐఎస్ఎఫ్ ధర్నా



**అనంతపురం అర్బన్ మన జనప్రగతి మే 13:-** కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న జిల్లా విద్యాశాఖ కార్యాలయ డిప్యూటీ డీఈఓ సీసీ మంజీరాను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ మంజీరా ప్రభుత్వ అధికారిగా కాకుండా శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ సంస్థలకు 'పార్టనర్'లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీఈఓ ఇచ్చే ఆదేశాలను అమలు చేయాల్సింది పోయి, ముందే ఆ సమాచారాన్ని యాజమాన్యాలకు చేరవేస్తూ ఇన్ఫార్మర్‌గా మారారని మండిపడ్డారు.విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న సీసీని వెంటనే తొలగించాలి.జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలి విద్యాశాఖలో ఏ పని జరగాలన్నా మంజీరా కనుసన్నల్లోనే జరుగుతోందని, ఈ ధోరణిని అరికట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తగ్గుపర్తి చందు, మంజునాథ్, నాని, బాబ్జాన్, తేజ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లె వృషభాచలేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి

- దేవస్థాన అభివృద్ధి పనులు త్వరితగతంగా పూర్తి చేయండి.
- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్.



**వేంపల్లె మన జనప్రగతి మే 13:-** స్థానిక పాపాగ్ని నది తీరాన వెలసిన వృషభ చలేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని అందుకు సంబంధించి పూర్తిస్థాయిలో చేయూతనిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శుభా చలేశ్వర దేవస్థానాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిప్రవీణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు అలాగే దేవస్థాన చైర్మన్ రమణ కార్య నిర్వహణ అధికారి సుభాష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవస్థానం విశిష్టత గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు దేవస్థానం అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని అనుకోరారు అలాగే ప్రస్తుతం జరుగుతున్న పనులు త్వరితగతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ముస్లింలకు కడపలో నాలుగు సర్కిల్స్‌ను ఏర్పాటు చేయాలి: ముస్లిం మైనార్టీ నాయకులు




**కడప మన జన ప్రగతిమే 13:-** కడపనగరం లో ముస్లిం వర్గాన్ని కూడా ప్రాధాన్యత ఇస్తూ ముస్లిం నాయకుల పేర్లతో నాలుగు సర్కిల్ ఏర్పాటు చేయాలని ముస్లిం మత పెద్దలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఈ సందర్భంగా వైయస్సార్ ప్రెస్ క్లబ్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలోని అల్మాస్ పేటలోజరిగిన మత ఘర్షణలు ఖండిస్తున్నాం. గతంలో అల్మాస్ పేట సర్కిల్లో టిప్పు సుల్తాన్ సర్కిల్ గా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కడప కార్పొరేషన్ లో కూడా వీటి గురించి రెజల్యూషన్ పాస్ అయింది. కానీ ఎందుకో ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదు. కడపలో ఎన్నో ఏళ్ల నుంచి ఉగాది పండగకు వినాయక చవితి పండగకు రంజాన్ పండగ లకు హిందూ ముస్లిం సోదరులు వారి వారి ఇండ్లకు వెళ్లి శుభాకాంక్షలు చెప్పి భోజనాలు చేసే సంప్రదాయం ఉందని వాటిని కొన్ని మత శక్తులు దెబ్బతీయడానికి సర్వ విధాలుగా ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. వారి ఆటలు ఎప్పటికీ సాగవు. హిందూ ముస్లిమ్స్ ను ఎవరు విడదీయలేరని వారు తెలిపారు. కడప నగరంలో ఎక్కడైనా సరే నేక్ నామ్, అబ్దుల్ కలాం ,అబ్దుల్ కలాం ఆజాద్ లాంటి పేర్లతో కడపలో ఎక్కడైనా సరే నాలుగు సర్కిల్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘర్షణకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కానీ ఈ కేసులో అమాయకులను వదిలి పెట్టాలని జిల్లా అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముక్తి రహముల్లా ఖాన్, ఇసాక్ హజరత్ ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు మెంబర్, బి ఎస్ రహమతుల్లా, అక్బర్ మౌలానా, సయ్యద్ ఇదైతుల్లా, షేక్ సలీం, అప్సర్ ఖాన్. కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి లోకేష్ అభినందనలు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 13:** భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనత కేవలం 25 ఏళ్ల వయసులో అటు భారతదేశంలో ఇటు అమెరికాలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసే అధికార లైసెన్స్ పొందిన సందర్భంగాఈ అద్భుత ఘనతపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ స్పందిస్తూ తన ట్విట్టర్ (ఙ) వేదికగా సాయి శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పులివెందుల వాసిగా,యువ ప్రతిభావంతుడిగా సాయి శ్రీనివాస్ సాధించిన ఈ విజయం తెలుగు సమాజానికి గర్వకారణం అని ఆయన కొనియాడారు.సాయి శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గ ప్రజలు మరియు పలువురు ప్రముఖులు సాయి శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## రైతులకు మార్గదర్శకంగా కేంద్ర బృందం

- చీని తోటలలో సమస్యల గుర్తింపు
- సరైన మందులతో నివారణ
- శాస్త్రీయ పద్ధతుల అమలుకు పిలుపు



**తొండూరు మన జనప్రగతి మే 13:-** మండలంలోని కృష్ణంగారిపల్లి, గుండ్లమడుగు గ్రామాల్లో చీని తోటలను కేంద్ర సమగ్ర శాస్యరక్షణ కేంద్రం విజయవాడ మరియు ఉద్యాన శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో పోలుసు పురుగు అధికంగా ఉండటంతో చెట్ల బేరడు చీలిపోవడం, చెట్లు వాడిపోవడం గమనించినట్లు తెలిపారు.కాండంపై "పైతోప్తోరా" అనే బంక సీలింద్ర నాసిని ఏర్పడి, వేరు వ్యవస్థ దెబ్బతిని చెట్ల ఎదుగుదల మందగించి, చివరికి చెట్లు మరణించే ప్రమాదం ఉందని నిపుణులు వివరించారు.చీని చెట్లు ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు 60 లీటర్లకు మించి నీరు ఇవ్వకూడదని అధికారులు సూచించారు.పోలుసు పురుగు నియంత్రణ కోసం గొనె సంచితో కాండం లేదా బేరడును బాగా రుద్ది, తరువాత భూప్రొఫెజైన్ (1 లీటర్ నీటికి 2.5 మి.లీ) మరియు బేనోల్ ఆయిల్ (1 లీటర్ నీటికి 10 మి.లీ) కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ విధంగా చేస్తే పురుగును శాశ్వతంగా నివారించవచ్చని తెలిపారు.ట్రికోడర్మా మరియు సూడోమోనస్ ద్రావణాలను సంవత్సరానికి రెండుసార్లు భూమిలో వేయడం ద్వారా వేరు కుళ్ళు వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని కేంద్ర బృందం వెల్లడించింది.ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద ప్రతినిధులు ఎం.పి. గోస్వామి, జాయింట్ డైరెక్టర్ కె.వి. చౌదరి, కీటక శాస్త్ర అధికారి, ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర రెడ్డి, రైతుసేవా కేంద్ర సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## నెల్లూరులో టీడీపీ మహానాడు ఏర్పాట్లకు శ్రీకారం

**- అలంకరణ కమిటీ బాధ్యతలు డాక్టర్ వి.ఎస్. ముక్తియార్‌కు అప్పగింత**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 13:-**తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని 2026 సంవత్సరానికి నెల్లూరులో నిర్వహించాలని నిర్ణయించింది.ఈ నేపథ్యంలో బుధవారం నెల్లూరులో కమిటీ సభ్యులతో కీలక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పాల్గొనడం విశేషంగా నిలిచింది.మహానాడు విజయవంతమైన నిర్వహణ కోసం పలు కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో అలంకరణ కమిటీ బాధ్యతలను ప్రొద్దుటూరు వాసి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ చైర్మన్ అలాగే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.ఎస్.ముక్తియార్‌కు అప్పగించారు.ఈ సందర్భంగా డాక్టర్ వి.ఎస్.ముక్తియార్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ,అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా,అత్యంత బాధ్యతతో నిర్వహిస్తానని తెలిపారు.

## విశ్వనాథపురంలో ఘనంగా హనుమాన్ జయంతి... ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 13:-**చాపాడు మండలం విశ్వనాథపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించిన హనుమాన్ జయంతి మహోత్సవాలలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా గ్రామ ప్రజలు,భక్తులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కార్తిక్ రెడ్డి, ఎమ్మెల్యే కి శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం గ్రామీణ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు.పోటీలలో పాల్గొన్న యువకులను అభినందిస్తూ, గ్రామీణ సంస్కృతి మరియు సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులు,యువకులు, గ్రామ పెద్దలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పులివెందులలో ఘనంగా ముగిసిన శ్రీమద్భాగవత సప్తహ పఠన మహోత్సవం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 13:** వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో వెలసిన శ్రీ కృష్ణ ఆలయంలో గత ఏడు రోజులుగా జరుగుతున్న శ్రీమద్భాగవత సప్తహ పఠన కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా ముగిసింది.పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమం ప్రముఖ దాతల తులసీశ్వర రెడ్డి మరియు సాయిత్రమ్మ దంపతుల ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడింది.గత ఏడు రోజులుగా భక్తులకు,పండితులకు ఉదయం,మధ్యాహ్నం మరియు రాత్రి సమయాల్లో అల్పాహారం,భోజన వసతులు కల్పించారు.భాగవత పారాయణం చేసిన పండితులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.బుధవారం ఉదయం 11 గంటలకు మంత్రపుష్పం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మహిళలు కలశాలను ధరించి ఆలయం చుట్టూ ప్రదర్శన చేపట్టారు.ఓం నమో భగవతే వాసుదేవాయ అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలోభాగవత భక్త సమాజానికి చెందిన సభ్యులు గొందిపల్లి నారాయణరెడ్డి (సమాజం సలహాదారుడు)డి.గంగిరెడ్డి (సమన్వయకర్త)తొండూరు నారాయణరెడ్డి(కార్యనిర్వాహకుడు)కె.కె.కొట్టాల రంగనాథం (కార్యదర్శి)తాళ్ళపల్లి గురురెడ్డివడ్డెమాను రామలింగారెడ్డి (స్వామి గుడి నిర్మాత)యాగంటి బాలకృష్ణారెడ్డి (మీడియా కన్వీనర్)వీరితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు,స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
14 -05-2026

# బాక్సింగ్ అభ్యున్నతికి పూర్తిస్థాయిలో సహకరిస్తాం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 13:-** కర్నూలు జిల్లాల్లో బాక్సింగ్ అభ్యున్నతి కోసం పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని ఏ. పి.బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు తెలిపారని బాక్సింగ్ శిక్షకులు టీ. తేజ, వెంకటేశ్వర్లు, తెలిపారు. బుధవారం వారికి సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 11, 12 న ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు ను మర్యాదపూర్వం కలవడం జరిగింది అన్నారు.బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ కర్నూల్ డిస్టిక్ కార్యదర్శి టి. తేజ బాక్సింగ్ శిక్షణ కేంద్రాలు ఎక్కువ నిర్వహించాలని, బాక్సింగ్ మంచి అభివృద్ధి సహకరించాలని కూర ఏమన్నారు. ఈ సందర్భంగా ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ కర్నూల్ జిల్లా బాక్సింగ్ కి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తాననీ తెలిపారు అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలదండతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు టి. వెంకటేశ్వర్లు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత తాగునీటి పరిష్కారానికి కృషి చేస్తాం

## - నాబార్డ్ సెంట్రల్ టీం నారాయణ



**పత్తికొండ మన జన ప్రగతి మే 13:-**ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో తాగునీటి కొరత తీవ్రత ఉన్న గ్రామాలను నాబార్డు సెంట్రల్ టీమ్ నారాయణ ఆర్డబ్ల్యూఎస్ డీఈ ఆధ్వర్యంలో బుధవారం పతికొండ మండల పరిధిలోని నలకదొడ్డి,అట్టికలగుండు,దేవనబండ,గ్రామాలను నాబార్డ్ టీము పంచాయతీ కార్యదర్శిలతో కలిసి గ్రామాలను పర్యటించారు.అందులో భాగంగానే నలకదొడ్డి గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ఆధ్వర్యంలో నాబార్డు సెంటర్ టీం కలిసి గ్రామంలో ఎలాంటి నీటి కొరత లేకుండా అటికలగుండు,నలకదొడ్డి గ్రామపంచాయతీని పూర్తిస్థాయిలో పర్యవేక్షించి నాబార్డ్ నిధుల ద్వారా ఎలాంటి నీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు,కావున గ్రామ ప్రజలంతా కూడా సహకరించాలని కోరారు,సెంట్రల్ టీంతో పాటు గ్రామ టిడిపి నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# గండి అంజన్నను దర్శించుకున్న మంత్రి ఆనం

- హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు
- మంత్రిని సన్మానించిన జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్



**చక్రాయపేట మన జనప్రగతి మే 13:-**రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలో జరుగుతున్న శ్రీ వీరాంజనేయస్వామి కుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా మంగళవారం హనుమాన్ జయంతి నాడు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామిలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు దాసరి రవిశంకర్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

# కురుబల ఉన్నతి టీడీపీతోనే...: మంత్రి సవిత





మచిలీపట్నం మన జనప్రగతి మే 13:- కురుబల ఉన్నతి టీడీపీతోనే సాధ్యమని, ఆ సామాజిక వర్గీయులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు కూడా అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడుతోనే వచ్చిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని, కురుబ సామాజిక వర్గీయులు తమ బిడ్డలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సాహించాలని పిలుపునిచ్చారు. త్వరలోనే గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు అందజేయనున్నట్లు తెలిపారు. బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలో బుధవారం జరిగిన శ్రీకామ్రవతీ సమేత బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వభించిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ, విద్యతోనే కురుబలు ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి, బీసీలకు అండగా నిలిచారన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి సంజీవరెడ్డిగారి రామచంద్రారెడ్డిని అన్న ఎన్టీఆర్ రాజకీయంగా ప్రోత్సహించారన్నారు. ఎమ్మెల్యే టిక్కెటివ్వడమేకాకుండా మంత్రిగా అవకాశాలు ఇచ్చారన్నారు, అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు కేబినెట్లో అన్ని శాఖలకు మంత్రిగా పనిచేసిన ఘనత తన తండ్రిదన్నారు. టీడీపీ ప్రభుత్వాలతో అండదండలతోనే కురుబ సామాజిక వర్గానికి చెందిన తన తండ్రికి ఇంతటి గౌరవం లభించిందన్నారు. టీడీపీలో పనిచేసే ప్రతి కార్యకర్తకూ పదవులు వెతుక్కుంటూ వస్తాయని మంత్రి సవిత తెలిపారు. **త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ వస్తోందని మంత్రి సవిత తెలిపారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేలా శాశ్వత జీవో జారీచేశామన్నారు. తిరుపతిలో కాంస్య విగ్రహ ఏర్పాటుకు మంత్రి నారా లోకేశ్ సహకారంతో స్థలం మంజూరైందన్నారు. త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు అందించనున్నామన్నారు. కాకులపాడు బీరయ్య దేవస్థానం నిర్మించిన నిర్వాహకులకు మంత్రి సవిత అభినందించారు. గన్నవరం నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జరుపుతున్న కృషిని కొనియాడారు. విద్యలో రాణిస్తున్న కురుబ సామాజిక వర్గం విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు న శ్రీకామ్రవతీ సమేత బీరయ్య స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మంత్రి సవితకు, ఎమెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కాకులపాడు గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నిర్వహించి, గజమాలతో సత్కరించారు. ఆలయ పత్రిష్టాపన సందర్భంగా బీరయ్య స్వామి దేవస్థానంలో మంత్రి సవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సవితను కురబ సామాజిక వర్గీయులు ఘనంగా పత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుబ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దేవంద్రప్ప, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, కురుబ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమైన శ్రీదేవమ్మ

- పలు గ్రామాల్లో కార్యక్రమాలకు హాజరు
- వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే





**పత్తికొండ మన జనప్రగతి మే 13:-**వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి నూతన గృహప్రవేశ ఆహ్వాన కార్యక్రమంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల కన్వీనర్ రవి రెడ్డి, పంచాయతీరాజ్ పత్తికొండ తాలూకా అధ్యక్షుడు అల్లుగుండు శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి వెళ్లిన కంగాటి శ్రీదేవమ్మ గంపనెత్తి గోవిందు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని, కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు.తరువాత తుగ్గలి మండలం పెండేకల్ గ్రామంలో వైఎస్ఆర్ పార్టీ నాయకుడు రంగన్న కుమారుడి వివాహానికి హాజరై వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. అలాగే పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో నెట్టేకల్ కుటుంబానికి చెందిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.అనంతరం గుత్తి పట్టణంలో యూత్ వింగ్ జిల్లా జనరల్ సెక్రటరీ పత్తికొండ టౌన్ హరీష్ రెడ్డి ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి హాజరై కాబోయే వధూవరులను అభినందించి ఆశీర్వదించారు.

# చౌడూరులో ఇసుక దోపిడీపై రాచమల్లు ఫైర్..!


## - రైతుల భూములను కాపాడతాం..అక్రమాలు ఆపకపోతే ఉద్యమం.



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 13:-**ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బుధవారం చౌడూరు గ్రామంలోని ఏటి ప్రభుత్వ భూములను పరిశీలించి, అక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం తహసీల్దార్ ఉదయ్ కిరణ్ రాజును కలిసి ఇసుక దోపిడీని వెంటనే అరికట్టాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ..చౌడూరు గ్రామంలోని ఏటి పరివాహక భూముల్లో గత 30 ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రైతుల పక్షాన తాము హైకోర్టు నుంచి స్టేటస్ కో ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ, అధికార పార్టీ నాయకులు సాంకేతిక కారణాలు చూపుతూ భూములను చదును చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్ 657లో పనులు చేయడం లేదని చెబుతూ, 699-1, 699-3 సర్వే నెంబర్లలో పనులు కొనసాగిస్తున్నారని విమర్శించారు.ఏటిలోని ఇసుకను అక్కడే డంప్ చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించడం వల్ల శంకరాపురం, చౌడూరు, కాకిరేనిపల్లె, రంగసాయిపల్లె గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో భారీ వరదలు వస్తే చౌడూరు, శంకరాపురం గ్రామాలు మునిగిపోయే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు.ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు ఈ అక్రమాలను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించిన ఆయన, తాను ఇసుక దోపిడీ, అసాంఘిక కార్యకలాపాలను ప్రశ్నిస్తున్నందుకే తనపై జగనన్న కాలనీల అవినీతి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి తమ ఆరోపణలను విచారణ జరిపించి నిరూపించాలని సవాల్ విసిరారు. గతంలో జగనన్న కాలనీలపై విజిలెన్స్ విచారణ జరిగిందని, అందులో ఎలాంటి అవినీతి బయటపడలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు, అక్రమాలను బయటపెట్టేందుకు తాను ఎప్పటికీ పోరాడుతానని స్పష్టం చేశారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, చౌడూరు గ్రామ రైతులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఫోకస్

- కాలువల ఆక్రమణలు తొలగించాలి..
- ప్రతి వార్డుకు తాగునీరు అందాలి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 13:-**ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధి, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలపై ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశమైన ఆయన పట్టణంలోని పారిశుధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కాలువలు, డ్రైనేజీలపై జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి వార్డులో తాగునీటి సమస్య తలెత్తకుండా సరిపడా మంచినీటిని అందుబాటులో ఉంచాలని, నీటి సరఫరాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సూచించారు.

# భారీ దొంగతనాల ముఠా అరెస్ట్

- రూ.53 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- పులివెందుల డిఎస్పి వి.మురళి నాయక్




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 13:** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు వివిధ దొంగతనాలకు పాల్పడుతున్న భారీ ముఠాను అరెస్ట్ చేసి ముఠా వద్ద నుంచి సుమారు రూ.53,01,700/- విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డిఎస్పి వి మురళి నాయక్ తెలిపారు.పోలీసులు ముగ్గురు వేర్వేరు రకాల నేరగాళ్ల నుండి 19 మోటార్ సైకిళ్లు వాహనాలు (విలువ రూ.18,15,000/-),నగదు రూ.2,79,000/-,వెండి 1 కేజీ వెండి వస్తువులు (విలువ రూ.2,80,000/-),బంగారం 194 గ్రాముల బంగారు ఆభరణాలు (చైన్ స్నాచింగ్ ద్వారా 91 గ్రాములు, బంగారు షాపులో 103 గ్రాములు),మొబైల్ ఫోన్లు 2 సెల్ ఫోన్లు (విలువ రూ. 50,000/-) వాటిని రికవరీ చేసి మొత్తం 13 మంది నిందితులను 22 కేసుల్లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు.నరకలపేట నాగ భాష,బూసుపాటి కుమార్,గుండ్ల గంగయ్య,షేక్ హుస్సేన్,మరియు మలికె విజయ్ లు మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడ్డారని,చోటు కుమార్ (బీహార్) మరియు రవిప్రసాద్ (రాజస్థాన్)లు చైన్ స్నాచర్లని,సాగబాలి నారాయణమ్మ మరియు సాగబాలి ఉమాదేవి లు బంగారు షాపు లో మతనాలు చేశారని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పులివెందుల ఎస్ డి పి ఓ బుక్కే మురళి నాయక్,అర్బన్ సీఐ కె. శ్రీరామ్,మరియు ఎస్ఐ లు మధుసూదన్ రెడ్డి,ఎల్.తిమ్మోతి లను మరియు ఇతర సిబ్బందిని ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
14 -05-2026

# తిరుపతి,విశాఖపట్నంలు 'ఐకానిక్ టూరిజం హబ్స్'గా అభివృద్ధి: మంత్రి కందుల దుర్గేష్

**తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకున్న మంత్రి కందుల దుర్గేష్..**

**కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థన**



**తిరుమల మన జనప్రగతి మే 13:-** తిరుపతిని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక,పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ అన్నారు. భక్తులకు కేవలం దర్శనమే కాకుండా, ఆధ్యాత్మిక అనుభూతిని పెంపొందించేలా ఎకో మరియు అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. బుధవారం ఉదయం మంత్రి దుర్గేష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నిడదవోలు నియోజకవర్గ నేతలతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ కి టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన మంత్రి దుర్గేష్ "తెల్లవారుజామునే ఆ శ్రీనివాసుని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకోవడం జన్మధన్యంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నాను" అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ ప్రణాళికలను వివరించారు.స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, తిరుపతిలో అధునాతన వసతులు, స్టార్ హోటళ్ల నిర్మాణానికి ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో తిరుపతి, విశాఖపట్నం నగరాలను అంతర్జాతీయ స్థాయి 'ఐకానిక్ టూరిజం హబ్స్'గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాయలసీమను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29ని అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే తిరుపతిలో సుమారు ఆరు 'స్టార్ హోటళ్ల' నిర్మాణానికి పీపీపీ విధానంలో ప్రతిపాదనలు వచ్చాయని వెల్లడించారు.తిరుపతికి వచ్చే భక్తులు కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా, 2-3 రోజుల పాటు ఇక్కడే బస చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం తిరుపతి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడం కోసం ఎకో టూరిజం, సాహస క్రీడలు ఏర్పాటుచేస్తూ అడ్వెంచర్ టూరిజం వంటి వినూత్న అంశాలను అభివృద్ధి చేస్తామన్నారు.పర్యాటకులు ఇక్కడ ఎక్కువ కాలం గడిపేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక స్వర్గధామంగా మారుస్తామని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.అంతకుముందు బాపట్ల పర్యటన ముగించుకుని తిరుపతి చేరుకున్న మంత్రి దుర్గేష్ కి కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా తిరుపతి రీజియన్‌లోని పర్యాటక ప్రాంతాల స్థితిగతులపై జిల్లా పర్యాటక శాఖ అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయి అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అదే విధంగా హోటల్ రీజెంట్ దేవరాయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.ఏపీని ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# మదనపల్లెలో వాహనాలకు అనధికారిక సైలెన్సర్ మార్పులపై ప్రత్యేక తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




**మదనపల్లె మన జనప్రగతి మే 13:-** రోడ్డు భద్రతకు విఘాతం కలిగించే విధంగా వాహనాలకు అనధికారికంగా మార్పులు చేయడాన్ని అరికట్టేందుకు జిల్లా రోడ్డు భద్రత కమిటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు మదనపల్లె పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల మెకానిక్ వర్క్‌షాప్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా అధికారి ఆధ్వర్యంలో మొత్తం 12 వర్క్‌షాప్‌లను తనిఖీ చేయగా, వాటిలో మూడు వర్క్‌షాప్‌లలో వాహనాలకు అధిక శబ్దం వచ్చే విధంగా మార్పు చేసిన సైలెన్సర్లు అమర్చడం, రోడ్డు భద్రతా నిబంధనలకు విరుద్ధంగా అనధికారిక యాక్సెసరీస్ అమర్చడం గుర్తించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వర్క్‌షాప్ యజమానులకు వెంటనే హెచ్చరికలు జారీ చేసి, ఇకపై ఇలాంటి అనధికారిక మార్పులు చేపట్టరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే మోటార్ వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాహన యజమానులు నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వాహనాలలో మార్పులు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు.

# మహిళలు ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకొని రాణించాలి

- ఖాతాదారులకు మెరుగైన సేవలే ప్రామాణికం కావాలి
- సాయి లక్ష్య బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవంలో వైయస్ మనోహర్ రెడ్డి





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 13:** మహిళలు ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకొని తమ వ్యాపార రంగంలో రాణించాలని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ప్రామాణికం కావాలని సాయి లక్ష బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవంలో మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.పులివెందులలోని పార్లపల్లి రోడ్డులో బుధవారం చర్మ సౌందర్య నిపుణురాలు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో సాయి లక్ష బ్యూటీ పార్లర్ ని మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి,వైకాపా పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ పార్లర్ ప్రారంభోత్సవ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని యజమానురాలు లక్ష్మీప్రసన్నని అభినందించి ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకొని తమ వ్యాపార రంగంలో మరింత రాణించాలని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ప్రసన్న కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు మరియు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహిస్తాం: మంత్రి నారాయణ

**చరిత్రలో తొలిసారి కిసాన్ సెజ్ వేదికగా నెల్లూరు జిల్లాలో మహానాడు.**

**మహానాడు విజయవంతానికి పక్కా ప్లాన్తో వ్యూహ రచన**

**కమిటీలకు దిశానిర్దేశం చేసిన అగ్రనేతలు**





**నెల్లూరు మన జనప్రగతి మే 13:-** ఈనెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న టీడీపీ పండుగ మహానాడు కు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి.మహానాడు నిర్వహించనున్న కిసాన్ సెజ్ ప్రాంగణంలో రాష్ట్రపార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్,మంత్రులు అగ్రనేతలు కమిటీల కన్వీనర్ లు,కో కన్వీనర్ లు,సభ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.సమావేశానంతరం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రిడాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు.ప్రతి ఏటా నిర్వహించే మహానాడును చరిత్రలో తొలిసారిగా పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు , వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నెల్లూరు జిల్లాలోని కిసాన్ సెజ్‌ను మహానాడు వేదికగా నిర్ణయించడం జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం జరిగిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర పార్టీ తాజా, మాజీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు , అచ్చెన్నాయుడు సమక్షంలో మహానాడు నిర్వహణకు సంబంధించిన అన్ని కమిటీల కన్వీనర్లకు, కో-కన్వీనర్లకు,సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారని వెల్లడించారు.ఈ మహానాడును టీడీపీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా, ఎక్కడా చిన్న లోటుపాట్లు లేకుండా పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నామన్నారు.ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామన్నారు.అందరినీ సమన్వయపరుచుకొని మహానాడును విజయవంతం చేస్తామన్నారు.అంతకుముందు ఆయన సహచర మంత్రులతో కలిసిమహానాడుకు యుద్ధప్రాతిపదికన సాగుతున్న ఏర్పాట్లను,పరిశీలించారు.సన్నాహక సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి ,కిలారి రాజేష్,జిల్లా పార్టీ అధ్యక్షులు బీదా రవిచంద్ర, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్,బీసీ జనార్ధన్ రెడ్డి,నిమ్మల రామానాయుడు ,అనగాని సత్యప్రసాద్,,మండపల్లి రాంప్రసాద్ రెడ్డి,కొల్లు రవీంద్ర,వాసంశెట్టి సుభాష్,అనిత,,మంతెన సత్యనారాయణ రాజు. మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్ రెడ్డి,ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు,మహానాడు కమిటీల కన్వీనర్లు,కోకన్వీనర్లు,సభ్యులు పాల్గొన్నారు.

**మహానాడుపై జిల్లా ప్రతినిధుల కీలక భేటీ** కిసాన్ సెజ్‌లో మహానాడు సన్నాహక సమావేశం అనంతరం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అధ్యక్షతన ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజాప్రతినిధులు ,మంత్రులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.జన సమీకరణ, వసతి, రవాణా, ట్రాఫిక్, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేకంగాచర్చించారు. మహానాడుకు హాజరయ్యే ప్రతిఒక్కరికీ ఎలాంటి లోటు లేకుండా ఆత్మీయ ఆతిథ్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కావ్యా కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఇంటూరి నాగేశ్వరరావు, పులివర్తి నాని ,రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ రైతులకు శుభవార్త

- కనీస మద్దతు ధరలు పెంపు
- రైతుల ఆదాయం పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం
- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు



**అమరావతి మన జనప్రగతి మే 13:-** దేశ రైతాంగ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు (MSP) రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయమని ఆయన అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఖరీఫ్ పంటల MSP పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల 60 వేల కోట్ల భారీ వ్యయాన్ని ఆమోదించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పెట్టుబడి ఖర్చుకు కనీసం 50 శాతం లాభం జోడించి MSP ధరలు నిర్ణయించడం రైతులకు నిజమైన భరోసా కల్పించే చర్యగా అభివర్ణించారు. రైతు కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతోనే పలు పంటల మీరాలను గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. వరి కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.72 పెంచి రూ.2441, గ్రేడ్-ఏ వరికి రూ.2461 నిర్ణయించడం రైతులకు లాభదాయకమని తెలిపారు. జొన్నకు రూ.4073, రాగికి రూ.5205, సజ్జలకు రూ.2900, ఉలవలకు రూ.8200, మొక్కజొన్నకు రూ.2410, నువ్వులకు రూ.10,346, సన్‌ఫ్లవర్‌కు రూ.8343, పత్తికి రూ.8667, వేరుశనగకు రూ.7517 వరకు MSP పెంపు ప్రకటించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న వ్యయభారం, ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రాష్ట్రంలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మీరాలను పూర్తిస్థాయిలో పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ వ్యవస్థ, మద్దతు ధర అమలు ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు రాష్ట్ర రైతుల తరఫున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# దేశ ప్రజలకు పొదుపు గురించి చెప్పడం మంచిదే కానీ...




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 13:-** దేశ ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో జీవనోపాధి కొనసాగించుకుంటూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారని, అయితే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన "బంగారం కొనొద్దు, ఆయిల్ కొనొద్దు, దుబారా ఖర్చులు చేయొద్దు" అనే వ్యాఖ్యలు సమాజంలోని అనేక వర్గాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నేను బంగారు రంగంలో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న ఒక సాధారణ వర్కర్‌గా కూడా ఈ విషయాన్ని చెబుతున్నాను అన్నారు. నాకు బంగారం పని తెలుసు, బంగారు సాగు కూడా ఉంది, ఈ రంగంలో ఒక ఆర్ట్, ఒక రోజువారీ వ్యాపారం ఆధారంగా ఎంతోమంది కుటుంబాలు జీవిస్తున్నారని నాకు ప్రత్యక్షంగా తెలుసు అన్నారు. బంగారం వ్యాపారం అనేది కేవలం షాపుల మాత్రమే కాదు ఇందులో బంగారు పనివాళ్లు, కార్మికులు, డిజైన్ తయారు చేసే కళాకారులు, పాలిష్ చేసే వారు, చిన్న చిన్న వర్క్ షాపులు, ఫైనాన్స్ మీద పని చేసే కుటుంబాలు, దుకాణాల్లో పని చేసే ఉద్యోగులు ఇలా వేలాది మంది జీవనోపాధి ఆధారపడి ఉంది అని తెలిపారు. అలాగే ఆయిల్ కొనొద్దు, ఖర్చులు తగ్గించండి అనే వ్యాఖ్యలు చిన్న హోటల్స్, స్వీట్ షాపులు, ట్రాన్స్‌పోర్ట్ రంగం, రైతులు, కూలీలు మరియు రోజువారీ ఆదాయం మీద ఆధారపడి జీవించే పేద మధ్యతరగతి కుటుంబాలపై కూడా ప్రభావం చూపుతాయి అని తెలిపారు. ప్రధాని ప్రకటన వ్యాపారాలు మూతపడే పరిస్థితి వస్తుంది అన్నారు. దాని ఫలితంగా నిరుద్యోగం పెరిగి అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. దేశ ప్రజలకు పొదుపు గురించి చెప్పడం మంచిదే కాని, అదే సమయంలో చిన్న వ్యాపారులు, కార్మికులు, వర్ధన్న వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి కూడా సమతుల్యంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ప్రకటనలు చేసేటప్పుడు ప్రధాని మోడీ ఆలోచించాలని, సామాన్య ప్రజలను కాపాడాలని ఖాజా హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174